సాక్షి రంగారెడ్డి

ఆదివారం । 11 । ఆగస్టు । 2024



'సీజనల్'.. డేంజర్

వర్షాకాలం వ్యాధులను వెంట తీసుకొచ్చే ప్రమాదం ఉంది. పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. 8లో▸



బురిడీ కొట్టించబోయి..

బాబాల అవతారంలో బురిడీ కొట్టించేందుకు యత్నించిన దొంగబాబాలకు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. 8లో▸

జాబ్‌మేళాకు స్పందన

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూ క్యాంపస్‌లో శనివారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అనూహ్య స్పందన లభించింది. మేళాను జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ బుర్రా వెంకటేశం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కంపెనీ నిర్వాహకులను ఉద్యోగాల గురించి, జీతభత్యాల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రేపు శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌తో ఫోన్ ఇన్

శంకర్‌పల్లి మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్రజల ఇబ్బందులు తదితర విషయాలపై ప్రజలకు ఫోన్ ఇన్ ద్వారా కమిషనర్ సలహాలు, సూచనలు ఇస్తారు.





అంశం : పారిశుద్ధ్యం, పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు
మున్సిపాలిటీ : శంకర్‌పల్లి
కమిషనర్ : శ్రీనివాస్
తేదీ : 12-08-2024 (సోమవారం)
సమయం : ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు

ఫోన్ చేయాల్సిన నంబర్:
73311 27776

న్యూస్‌రీల్

ఎస్సీమోర్చా రాష్ట్ర కార్యదర్శిగా బాణాల ప్రవీణ్‌కుమార్



ప్రవీణ్‌కు నియామకపత్రం అందజేస్తున్న ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ డాక్టర్స్ కాలనీకి చెందిన బాణాల ప్రవీణ్‌కుమార్ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్ నుంచి నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎస్సీమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధీరజ్‌రెడ్డి, ఆర్‌కేపురం కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'డాక్టర్' అనితారెడ్డి



వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం: జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి శనివారం డాక్టర్‌గా రోగులను పరీక్షించారు. మండల పరిధిలోని చిన్నతూప్రాలో ఆర్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిబిరానికి వచ్చిన వారికి బీపీ, ఇతర పరీక్షలు చేశారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిరుపేదలు నివసించే ప్రాంతాల్లో ఉచితంగా సేవలందించాలనే ఉద్దేశంతో ఆర్ట్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు.కార్యక్రమంలో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, నాయకులు పోలేపల్లి శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, మధరం నర్సింహగౌడ్,రాజు,అంజయ్య, పాష, రఘుగౌడ్, అవుల యాదయ్య,రాజునాయక్,రమేష్, లోకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నేసి.. కలిపేసి!



నాగన్‌పల్లిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి వేసిన రోడ్డు

దర్జాగా లావణి, సీలింగ్ భూముల కబ్జా

- ఏకంగా ప్రభుత్వ భూమి నుంచి రహదారి ఏర్పాటు
- రెండు నెలలుగా గుట్టుగా గుట్టల తవ్వకం
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'రియల్' మాఫియా రెచ్చిపోతోంది. లావణి భూములను గుట్టుగా మింగేస్తున్నారు. పక్కనే ఉన్న తమ పట్టా భూముల్లో కలిపేసుకుంటున్నారు. రాకపోకలకు ప్రభుత్వ భూముల నుంచి దర్జాగా రహదారులు కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇందు కోసం ఎత్తయిన కొండలు, గుట్టలను కూడా తొలిచేస్తున్నారు. కళ్లముందే ఇంత జరుగుతున్నా.. రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడక పోవడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నాగన్‌పల్లి సర్వే నంబర్ 189లో..

ఇబ్రహీంపట్నం మండలం నాగన్‌పల్లి రెవెన్యూ సర్వే నంబర్ 189లో 191.15 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో కొంత మొత్తాన్ని స్థానిక పేద రైతులకు అసైన్డ్ చేసింది. మరికొంత మిగిలి ఉంది. ఈ భూములపై కన్నేసిన ఓ ముఖ్యనేత సోదరుడు.. ఆ పక్కనే ఉన్న కొంత పట్టా భూమిని కొనుగోలు చేశాడు. తన పట్టా భూమిలో లావణి భూములను కలిపేశాడు. ఇక్కడికి రాకపోకల కోసం 70 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి, అందులో నుంచి రెండు నెలలుగా 200 ఫీట్ల రోడ్డు వేస్తున్నారు. అడ్డుగా ఉన్న గుట్టలను తొలుస్తున్నారు. ఇప్పటికే కిలోమీటర్ మేర తవ్వకాలు, రోడ్డు పనులు పూర్తయ్యాయి. అయినా క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

అనాజ్‌పూర్ సర్వే నంబర్ 281లో..

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్ రెవెన్యూ సర్వే నంబర్ 281 కూడా నాగన్‌పల్లికి ఆనుకునే ఉంటుంది. ఇక్కడ 357.39 ఎకరాల భూమి ఉంది. ఇందులో 150 ఎకరాలు సీలింగ్, మరికొంత పట్టా భూమి ఉంది. స్థానిక రైతులను మభ్య పెట్టి వారి నుంచి చాలా తక్కువ ధరకే సీలింగ్ భూములు కొట్టేశారు. 15 మంది రైతులకు సంబంధించిన సీలింగ్ భూములను తక్కువ రేటుకు కొనుగోలు చేసి, తమ పట్టా భూమిలో కలిపేసుకున్నారు. 300 ఎకరాల్లో వెంచర్ చేస్తున్నారు. ఈ ఆక్రమణల వెనుక ఓ కీలక నేత సోదరుడు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

శంషాబాద్ సర్వే నంబర్ 24లో..

అబ్దుల్లాపూర్‌మెట్, ఇబ్రహీంపట్నం మండలాల్లోనే కాదు శంషాబాద్, మహేశ్వరం మండలాల్లోనూ రియల్టర్లు ప్రభుత్వ, సీలింగ్, లావణి, అసైన్డ్, భూదాన్ భూములను పెద్ద ఎత్తున కొల్లగొడుతున్నారు. శంకరాపూర్ సర్వే నంబర్ 24లో 62.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉండగా, ఇందులో 20 ఎకరాలు స్థానిక రైతులకు లావణి పట్టాలు ఇచ్చింది. రైతులను మభ్యపెట్టి ఈ భూములను కొల్లగొట్టిన ఓ రియల్టర్ ఏకంగా ఆయా భూముల చుట్టూ ప్రీకాస్ట్ గోడలు కట్టి..షెడ్లు కూడా వేశారు. చుట్టూ బౌన్సర్లను పెట్టి, అటువైపు ఇతరులెవరూ రాకండా అడ్డుకుంటున్నారు. ఇక మహేశ్వరం మండలం మంఖాల్ పరిధిలోని 625 నుంచి 642 వరకు ఉన్న సర్వే నంబర్లలోని లావణి పట్టా భూముల కొనుగోలుకు ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఏకంగా రూ.కోటి అడ్వాన్స్ కూడా చెల్లించింది. నిజానికి అసైన్డ్, లావణి, సీలింగ్ భూములు అమ్మడమే కాదు కొనడం కూడా నేరమే. వీటిని పీటీటీ కింద వెనక్కి తీసుకునే అవకాశం ఉన్నా..సంబంధిత అధికారులు అటువైపు దృష్టిసారించక పోవడం గమనార్హం.



అనాజ్‌పూర్‌లోని ప్రభుత్వ భూమిని ఆక్రమించి పోసిన మట్టి

నోటీసులు ఇచ్చాం

నాగన్‌పల్లి సర్వే నంబర్ 189లోని అసైనీలకు, అనాజీపూర్ సర్వే నంబర్ 281లోని అసైనీలకు నోటీసులు ఇచ్చాం. ఈ భూములు అమ్మడమే కాదు కొనడం కూడా నేరమే. అమ్మకానికి పెట్టిన ఆయా భూములను వెనక్కి తీసుకుంటాం. ప్రభుత్వ భూమిలో నుంచి వేసిన రోడ్డును ధ్వంసం చేస్తాం. ఆక్రమణల వెనుక ఎంతటి వాళ్లున్నా వదిలిపెట్టబోం. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన క్షేత్రస్థాయి రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకుంటాం.

– అనంతరెడ్డి, ఆర్డీఓ, ఇబ్రహీంపట్నం

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం: విధి నిర్వహణలో, శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు అధికారులు, సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అన్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌ను శనివారం ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలతోపాటు అధికారులు, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందిస్తున్న సేవలను సమీక్షించారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ తదితర విభాగాల నిర్వహణ, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. సమస్యాత్మక ప్రాంతాల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల భద్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణను అడిగి తెలుసుకున్నారు.



ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి



దేవుని పడకల్‌లో వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే కసిరెడ్డి తదితరులు

- మంత్రి జూపల్లి కృష్ణారావు

తలకొండపల్లి: కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని దేవుని పడకల్ గేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి తన తండ్రి డోకూరి రాంరెడ్డి జ్ఞాపకార్థం నిర్మించిన ముఖ ద్వారాన్ని (ఆర్చ్) ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ్‌రెడ్డి, పీసీబీ కార్పొరేషన్ చైర్మన్ బాలాజీసింగ్, ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అర్బన్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.. కళాకారుల అభివృద్ధికి, వారి జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రభుత్వం పాటుపడుతోందని తెలిపారు. ఎమ్మెల్యే కోరిక మేరకు వెల్జాల్‌లోని వేదాద్రి లక్ష్మీనృసింహ స్వామి దేవాలయం, చెన్నారం సమీపంలో వెలిసిన మల్లప్ప గుట్ట మల్లి ఖార్జునుడి ఆలయన్ని, దేవుని పడకల్‌లోని శ్రీ వేంకటేశ్వరుడి దేవాలయాన్ని, కడ్తల్ మండలంలోని మైసిగండి దేవాలయాలను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం దేవుని పడకల్‌లోని శ్రీ వేంకటేశ్వర ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ముఖ ద్వార నిర్మాణ దాత డోకూరి ప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షుడు భగ్‌వాన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెరువులో అక్రమ కట్టడాల కూల్చివేత

మైలార్‌దేవ్‌పల్లి: శాస్త్రీపురం డివిజన్ పరిధిలోని బూమ్‌రూక్ ఉద్ దవాల్ చెరువులో శనివారం అక్రమ కట్టడాలను హైడ్రా అధికారులు కూల్చివేశారు. ట్రైసిటీ పరిధిలో హైడ్రా విభాగం ఆధ్వర్యంలో బఫర్ జోన్‌లతో పాటు ఎఫ్‌టీఎల్ పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగించారు. మొత్తం 6 భవనాలు, 2 ప్రహరీలను నేలమట్టం చేశారు. నిర్మాణంలో ఉన్న ఒక భవనం, అక్రమ లే–అవుట్లతో పాటు శివరాంపల్లిలోని ఊర్ల చెరువులో అక్రమ కట్టడాలను అధికారుల పర్యవేక్షణలో కూల్చివేశారు. అనుచరులతో కలిసి కూల్చివేతలను అడ్డుకునేందుకు యత్నించిన బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబీన్‌ను పోలీసులు అరెస్టు చేసి కేశంపేట స్టేషన్‌కు తరలించారు. చెరువు ఎఫ్‌టీఎల్‌కు సంబంధించిన దాదాపు పది ఎకరాల స్థలాన్ని హైడ్రా విభాగం అధికారులు తిరిగి స్వాధీనం చేసుకున్నారు. చెరువులను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ హెచ్చరించారు.

రాష్ట్రంలో అరాచక పాలన

కేశంపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన కొనసాగిస్తోందని బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబీన్ మండిపడ్డారు. శివరాంపల్లి శివారులోని చెరువును కబ్జా చేసి అక్రమ నిర్మాణాలను చేపట్టారనే ఆరోపణల నేపథ్యంలో శనివారం హైడ్రా అధికారులు వీటిని కూల్చేందుకు సిద్ధమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ముబీన్‌ను హైదరాబాద్‌లో అరెస్టు చేసి కేశంపేట పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముబీన్ మాట్లాడుతూ.. చెరువును కబ్జా చేసి నిర్మాణాలు చేస్తుంటే ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు ఏం చేశారని ప్రశ్నించారు. నోటీసులు ఇవ్వకుండా అధికారులు కూల్చివేతలు చేయడం విడ్డూరమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

మగాళ్లూ.. బస్సెక్కరూ!



'మహాలక్ష్మి' రాకతో పురుష ప్రయాణికులు తగ్గుముఖం

- గ్రేటర్‌లో 40 శాతానికి పడిపోయిన మేల్ ప్యాసింజర్స్
- ప్రయాణికుల సంఖ్యను పెంచేందుకు ఆర్టీసీ వినూత్న ప్రయత్నం
- ఒక్కో డిపోనకు అదనంగా రోజుకు రూ.లక్ష లక్ష్యంగా కార్యాచరణ
- సిబ్బందిపై ఒత్తిడి పెంచడంపై కార్మిక సంఘాల ఆందోళన

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ బస్సు ప్రయాణం బెంబేలెత్తిస్తోంది. సిటీ బస్సుల్లో పయనించేందుకు పురుష ప్రయాణికులు వెనకడుగు వేస్తున్నారు. 'మహాలక్ష్మి' రాకతో మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు మహిళలతో కళకళలాడుతున్నాయి. ఉదయం, సాయంత్రం రద్దీ వేళల్లో సిటీ బస్సుల్లో ప్రయాణం దాదాపు అసాధ్యంగా మారింది. దీంతో పురుష ప్రయాణికుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. ఒకప్పుడు బస్సుల్లో మూడొంతుల మగ ప్రయాణికులతో కనిపించే రద్దీ ఇప్పుడు మహిళలతో నిండుగా పరుగులు తీస్తోంది. మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో ఆర్టీసీకి ఆదాయం పెరిగింది. కానీ ప్రభుత్వం రీయింబర్స్ రూపంలో చెల్లిస్తుండడంతో నగదు రూపంలో వచ్చే ఆదాయం భారీగా పడిపోయింది. దీంతో టికెట్ కొనుగోలు చేసి ప్రయాణించే మగ ప్రయాణికుల సంఖ్యను పెంచుకొనేందుకు ఆర్టీసీ వినూత్న పంథాలో ముందుకు వెళ్తోంది. ప్రతి డిపోలో రోజుకు రూ.లక్ష అదనపు ఆదాయమే లక్ష్యంగా కండక్టర్లు, డ్రైవర్లను కార్యోన్ముఖులను చేస్తోంది. యాజమాన్యం ఒత్తిడి కారణంగా అదనపు ఆర్జన కోసం కండక్టర్లు, డ్రైవర్లు రూ.లక్ష లక్ష్యంగా మగప్రయాణికుల వేటలో పడ్డారు. ప్రధాన బస్టాపుల్లో బస్సుల కోసం ఎదురు చూసే మగ ప్రయాణికులను 'బస్సెక్కండి ప్లీజ్' అంటూ ఆహ్వానించడం ఆసక్తికరమైన పరిణామం.

సొంత వాహనాల వినియోగం..

మరోవైపు ఆర్టీసీ అధికారుల అంచనాల మేరకు మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చిన తర్వాత పెరిగిన మహిళా ప్రయాణికుల రద్దీతో మగవారు సొంత వాహనాల వినియోగం వైపు మళ్లారు. ద్విచక్ర వాహనాల సంఖ్య ఇటీవల కాలంలో బాగా పెరిగింది. ఈ పరిణామాన్ని దృష్టిలో ఉంచుకొని పురుష ప్రయాణికుల సంఖ్యను పెంచుకొనేందుకు ఆర్టీసీ వినూత్న ప్రయత్నాలు మొదలుపెట్టింది. గతంలో 'జెంట్స్ స్పెషల్' బస్సులు నడిపేందుకు సన్నాహాలు చేపట్టారు. కానీ దీనిపై వ్యతిరేకత రావడంతో ఈ ప్రయత్నాన్ని విరమించుకున్నారు. సీట్లపై 'స్త్రీలకు మాత్రమే' అని కనిపించే వాటి సంఖ్యను తగ్గించారు. పలు మార్గాల్లో మెట్రో లగ్జరీ బస్సులను అందుబాటులోకి తెచ్చారు.

మూడొంతుల ప్రయాణికులు మహిళలే..

గ్రేటర్ హైదరాబాద్‌లోని 29 డిపోల పరిధిలో ప్రతిరోజూ సుమారు 2,800 బస్సులు ప్రయాణికులకు రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నాయి. వీటిలో ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్‌లు 1,800కు పైగా ఉంటాయి. మెట్రో డీలక్స్, మెట్రో లగ్జరీ బస్సుల సంఖ్య తక్కువగా ఉంటుంది. దీంతో అన్ని వర్గాల ప్రయాణికులు ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులపైనే ఆధారపడి ప్రయాణం చేస్తారు. ముఖ్యంగా ఉదయం ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, అధ్యాపకులు, వ్యాపారులు తదితర వర్గాలతో బస్సుల్లో రద్దీ ఉంటుంది. సాయంత్రం తిరిగి ఇళ్లకు వెళ్లే సమయంలోనూ బస్సులు కిక్కిరిసి ఉంటాయి. మరోవైపు మహిళా ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో సాధారణ ప్రయాణికుల సీట్లు సైతం వారితోనే నిండిపోతున్నాయి. చివరకు మొదటి ప్రవేశ ద్వారం ఫుట్‌బోర్డు సైతం మహిళలతో కిటకిటలాడుతోంది.

- సిటీ బస్సుల్లో ప్రస్తుతం ప్రతిరోజూ సుమారు 22 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తున్నారు. వారిలో 15 లక్షల మందికి పైగా మహిళలే ఉన్నట్లు అంచనా. కేవలం 7 లక్షల మంది మగవారు ఉన్నారు. మహాలక్ష్మి పథకానికి ముందు ఉన్న ప్రయాణికుల లెక్కలు ఇప్పుడు పూర్తిగా తారుమారయ్యాయి. 'కొన్నిసార్లు బస్సుల్లో నిల్చోవడం కూడా కష్టంగా ఉంటోంది. బస్సెక్కి దిగే వరకు సర్కస్ ఫీట్లు చేసినట్లవుతుంది.' అని కుషాయిగూడ ప్రాంతానికి చెందిన శ్రీనివాస్ తెలిపారు. ప్రతిరోజూ అమీర్‌పేట్ వరకు రాకపోకలు సాగించడం కష్టంగా మారిందన్నారు.

రూ.లక్ష లక్ష్యం ఎందుకంటే..

'మొదటి నుంచి సిటీ ఆర్టీసీకి నష్టాలే. ఇప్పుడు 'మహాలక్ష్మి' పథకానికి ప్రభుత్వమే నిధులను అందజేస్తోంది. రోజువారీ అవసరాలు, బస్సుల నిర్వహణ, సిబ్బందికి ప్రోత్సాహకాలు వంటివి అందజేసేందుకు నగదు అవసరం. అందుకే ప్రతి డిపోలో రోజుకు ఒక రూ.లక్ష అదనంగా సంపాదించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం' అని ఆర్టీసీ అధికారి ఒకరు తెలిపారు. సాధారణంగా గతంలో ఉన్న విధంగా పురుష ప్రయాణికుల సంఖ్య ఎక్కువగా ఉంటే టికెట్లపై ఆశించిన స్థాయిలో ఆదాయం లభించేది. కానీ ఇప్పుడు వారి సంఖ్య తగ్గడంతో ఇబ్బందులు తలెత్తినట్లు పేర్కొన్నారు. ఈ క్రమంలో వారి సంఖ్యను పెంచుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.

కండక్టర్లు, డ్రైవర్లపై తీవ్ర ఒత్తిడి..

ఆర్టీసీ యాజమాన్యం తీవ్ర ఒత్తిడికి గురి చేస్తోంది. ఉచిత ప్రయాణ సదుపాయం అభినందనీయమే. కానీ ప్రయాణికుల రద్దీతో బస్సులు నడపడం కష్టంగా మారింది. ఈ సమయంలో మగ ప్రయాణికుల సంఖ్యను మరింత పెంచాలంటూ ఒత్తిడి చేస్తున్నారు. ఈ క్రమంలో కండక్టర్లు, డ్రైవర్లకు టార్గెట్లు విధిస్తున్నారు. తీవ్రమైన ఒత్తిడి మధ్య పని చేయడం వల్ల వారిలో ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి.

– ఇ.వెంకన్న, ఆర్టీసీ కార్మిక సంఘాల జేఏసీ చైర్మన్

సినారె సాహిత్య సేవ అజరామరం

- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

తుర్కయంజాల్ : సాహిత్యానికి డాక్టర్ సి.నారాయణరెడ్డి (సినారె) అందించిన సేవ చారిత్రాత్మకమైనదని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. తుర్కయంజాల్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన మహాకవి సినారె కళాపీఠం సాహిత్య పురస్కారాల ప్రధానోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్రలకు చెందిన పలువురు సాహితీవేత్తలకు సినారె సాహిత్య పురస్కారాలను అందజేశారు. అనంతరం చిన్నారెడ్డి మాట్లాడుతూ.. సినారె పట్టుదల, క్రమశిక్షణ ఆయన్ని ఉన్నత శిఖరానికి చేర్చిందని పేర్కొన్నారు. ప్రత్యక్షంగా తాను సినారెను కలిసింది తక్కువసార్లు అయినప్పటికీ ఆ అనుభవం వేల గ్రంథాల పరిజ్ఞాన విస్తరణతో సమానమని గుర్తు చేసుకున్నారు. భౌతికంగా మన మధ్య లేకున్నా ఆయన కవిత్వం అజరామమరమని అన్నారు. ముఖ్యంగా సాహిత్య ప్రేమికులతో పాటు ఆయన సినీ గేయ సాహిత్యం సామాన్య ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని ఏర్పర్చుకుందన్నారు. చివరి శ్వాస వరకు సాహిత్యాన్ని శ్వాసించిన నిరంతర కవి సినారే అని.. ఆయన లేకున్నా ఆయన మాట, పాట బతికే ఉన్నాయన్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ నందిని సిద్దారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ భాష సాంస్కృతిక మండలి అధ్యక్షుడు డాక్టర్ గంటా జలంధర్ రెడ్డి, సాహితీవేత్తలు దాసరి దయానంద రెడ్డి, తేజ సాహిత్య సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ పోరెడ్డి రంగయ్య, నిర్వాహకుడు, సినారె కళాపీఠం అధ్యక్షుడు మల్లకేడి రాములు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నారెడ్డి

పురస్కారాలు అందుకుంది వీరే..

డాక్టర్ టి.గౌరీశంకర్ (హైదరాబాద్), వై.హెచ్.కె. మోహన్ రావు (పల్నాడు – గుంటూరు), సంగెనేని రవీందర్ (ముంబై – మహారాష్ట్ర), డాక్టర్ చిదేళ్ల సీతాలక్ష్మి (హైదరాబాద్), కన్నోజు లక్ష్మీకాంతం (హైదరాబాద్), సమ్మెట ఉమాదేవి (ఖమ్మం), బూర్ల వెంకటేశ్వర్లు (కరీంనగర్), బిల్ల మహేందర్ (వరంగల్), డాక్టర్ కాసర్ల నరేష్ రావు (నిజామాబాద్), ధ్యావరి నరేందర్ రెడ్డి (రంగారెడ్డి).

'సీజనల్'.. డేంజర్



షాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది (ఫైల్)

అప్రమత్తతతోనే ఆరోగ్య రక్షణ

- పరిశుభ్రతే ప్రధాన ఆయుధం
- గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

షాబాద్: వర్షాకాలం గ్రామాల్లో కురుస్తున్న వర్షాలు వ్యాధులను వెంట తీసుకొచ్చే ప్రమాదం ఉంది. పరిసరాల్లో నీటి నిల్వ పెరిగి దోమలు వ్యాప్తిచెంది డెంగీ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఇప్పటికే మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య పెరిగిందని వైద్యవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రోగాల బారిన పడకుండా తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వైద్యాధికారులు సూచిస్తున్నారు.

రోగాల వ్యాప్తికి అనుకూలం

వర్షాల కారణంగా ఇళ్లలో నీటి వినియోగం తక్కువే. పరిసరాల్లో డబ్బాలో నిలిచిన నీటితో దోమలు వ్యాప్తి చెంది. లార్వా వృద్ధి చెందుతుంది. ఈ దోమలు ఇళ్లలోని అల్మారాలు, ఫర్నీచర్ వెనక ఉంటాయి. శిథిల భవనాలు, ఖాళీగా ఉన్న ఆవాసాల్లో శుభ్రత లోపించి దోమలు వృద్ధి చెందేందుకు ఆస్కా రం ఎక్కువ. వాతావరణం అనుకూలించగానే మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి వ్యాధులు ప్రబలడానికి కారణమవుతాయి. పైపులైన్ లీకేజీల కారణంగా తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

జాగ్రత్తలు

- ఇంటి పరిసరాల్లో నీరు నిల్వకుండా చూసుకోవాలి. కూలర్లు, డ్రమ్ములోని నీటిని పారబోయాలి. పాత్రలపై మూతలు పెట్టి ఉంచాలి.
- ఇంట్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.
- చల్లదనం పెరిగిన నేపథ్యంలో ఊపిరితిత్తుల సమస్యలున్న పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వెచ్చదనం ఉండేలా చూడాలి.
- కాచి చలార్చిన నీటితోపాటు, వేడి పదార్థాలనే ఆహారంగా తీసుకోవాలి.
- మాంసాహారం తగ్గించడంతో పాటు అవుట్‌సైడ్ ఫుడ్ దూరంగా ఉండాలి.

నిర్లక్ష్యం చేయొద్దు



వర్షాలతో వ్యాధులు వ్యాప్తి చెందే అస్కారం ఉంటుంది. ప్రజలు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తే వ్యాధులు దరిచేరవు. అనారోగ్యం బారిన పడితే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని వైద్యుడిని సంప్రదించి చికిత్స తీసుకోవాలి.

– డాక్టర్ దామోదర్, జిల్లా ఉప వైద్యాధికారి

గృహిణి అదృశ్యం



అనిత అహిర్వాల్(ఫైల్)

పహాడీషరీఫ్: గృహిణి అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు శనివారం తెలిపిన ప్రకారం .. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భగవాన్‌దాస్ అహిర్వాల్, అనిత అహిర్వాల్(29) దంపతులు. వీరు రెండు నెలల క్రితం బతుకుదెరువు నిమిత్తం తుక్కుగూడ హార్డ్‌వేర్ పార్కులో కూలి పని కోసం వలస వచ్చారు. ఈ నెల 6న భగవాన్ దాస్ తుక్కుగూడ మార్కెట్‌కు వెళ్లొచ్చేవరకు భార్య ఇంట్లో కనిపించలేదు. ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభ్యమవ్వలేదు. ఆమె భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో గాని సంప్రదించాలని కోరారు.

ఉద్యోగం పేరిట మోసం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై బాధితులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పట్టణంలో నివాసముంటున్న కాశీనాథ్ అనే వ్యక్తి ఎయిర్‌పోర్టులో ఓ కాంట్రాక్టు సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. తన పరిచయాల ద్వారా ఉద్యోగాల్లో పెట్టిస్తానని నలుగురు యువకుల నుంచి యాభై వేలు, డెబ్బైవేల చొప్పున తీసుకున్నాడు. ఉద్యోగాలు ఇప్పించకపోగా మాట దాటవేస్తుండడంపై అతడిని బాధితులు ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గోవుకు గోరక్షకుల సేవ

కాలువిరిగిన గోవును గోశాలకు తరలింపు

రాజేంద్రనగర్: రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి తీవ్ర గాయాలకు గురైన ఓ గోవును గోరక్షక్ సభ్యులు రాజేంద్రనగర్ పోలీసుల సహాయంతో గోశాలకు తరలించారు. కాళి మందిర్ ప్రధాన రహదారిపై ఓ వాహనం రోడ్డుపై ఉన్న గోవును ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో వాహనం బలంగా ఢీకొనడంతో గోవు కాలు విరిగి అక్కడే కుప్పకూలింది. అది గమనించిన గోరక్షక్ సభ్యులు మల్లేష్ యాదవ్ గోవు పరిస్థితిని పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గోరక్షక్ సభ్యులు మల్లేష్ యాదవ్, సురేశ్‌తో పాటు మరికొందరి సహాయంతో గోవును అత్తాపూర్‌లోని గోశాలకు తరలించారు. అక్కడి వెటర్నరీ వైద్యులు గోవుకు శస్త్ర చికిత్స నిర్వహించారు. ప్రస్తుతం గోవు కోలుకుంటుందని మల్లేష్ యాదవ్ తెలిపారు. రోడ్డుపై గోవులు ఉన్న సమయంలో వాహనదారులు నెమ్మదిగా వెళ్లాలని సూచించారు.

వైద్యుడిపై కేసు

మొయినాబాద్: వైద్యం వికటించి మహిళ మృతి చెందిన ఘటనలో డాక్టర్‌పై కేసు నమోదైంది. మండల పరిధిలోని అమ్డాపూర్ గ్రామానికి చెందిన మద్దెపాగ సావిత్రి(30) కాలు విరిగి స్థానిక భాస్కర ఆసుపత్రిలో చేరారు. ఆమెకు శస్త్రచికిత్స చేస్తుండగా వైద్యం వికటించి మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనకు సంబంధించి కుటుంబ సభ్యులు శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు స్పందించిన పోలీసులు ఆపరేషన్ చేసిన డాక్టర్‌పై కేసు నమోదు చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు శనివారం ఉదయం వరకు ఆసుపత్రిలోనే బైఠాయించారు. పోలీసులు వారికి నచ్చజెప్పి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు విచారణలో ఉందని ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

డాక్టర్ నిర్లక్ష్యం లేదు

కాలు విరిగిన మహిళ సావిత్రికి శస్త్ర చికిత్స నిర్వహించిన అనంతరం ఆమె మృతి చెందింది. ఇందులో డాక్టర్ నిర్లక్ష్యం లేదు. శస్త్ర చికిత్సకు ముందుగా టెస్ట్ చేసిన తర్వాత ఆమెకు మత్తు ఇంజక్షన్లు ఇచ్చారు. సాయంత్రం 5 గంటల వరకు పేషెంట్ బాగానే ఉంది. ఆ తరువాత ఆమెకు స్ట్రోక్ ఏమైనా వచ్చి ఉండవచ్చు. పోస్టుమార్టం రిపోర్టులో అన్ని విషయాలు తెలుస్తాయి.

– రాంచందర్‌రావు, భాస్కర ఆస్పత్రి సూపరింటెండెంట్

ట్యూషన్‌కు వెళ్లి వస్తుండగా..

- గుర్తు తెలియని వాహనం ఢీ..
- ఒకటో తరగతి విద్యార్థికి తీవ్ర గాయాలు

అత్తాపూర్: ఓ బాలుడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్న ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ రషీద్‌మియా తెలిపిన వివరాల ప్రకారం.. ఎంఎం పహాడీషరీఫ్ గార్డెన్ ప్రాంతంలో నివాసముంటున్న షేక్ మహబూబ్ కుమారుడు షేక్ మహబూబ్ మన్సూర్(6) స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలలో 1వ తరగతి చదువుతున్నాడు. పాఠశాల విద్యతో పాటు అరబిక్ నేర్చుకునేందుకు సమీపంలో ఉన్న ట్యూషన్ మాస్టర్ వద్ద అరబిక్ భాష నేర్చుకుంటున్నాడు. శుక్రవారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో ట్యూషన్ నుంచి ఇంటికి వస్తున్న మహబూబ్ మన్సూర్‌ను గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీకొన్నది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ బాబును చికిత్స నిమిత్తం బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో ఆసుపత్రిలో చేర్పించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని..



మైలార్‌దేవ్‌పల్లి: చికిత్స పొందుతున్న సరస్వతి

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో పారిశుద్ధ కార్మికురాలికి బైకు ఢీకొట్టడంతో కోమాలోకి వెళ్లింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గగన్ పహాడ్ ప్రాంతానికి చెందిన సరస్వతి శనివారం ఉదయం 5.30 గంటల ప్రాంతంలో మైలార్‌దేవ్‌పల్లిలో పారిశుద్ధ్య పనులు చేసేందుకు హాజరు వేసుకొని విధులు నిర్వహిస్తుంది. రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సరస్వతిని ఓ బైకు దుర్గానగర్ నుంచి పల్లెచెరువుకు వెళ్లే మార్గంలో వేగంగా వచ్చిన ఢీకొట్టింది. దీంతో బాధితురాలిని స్థానికులు, తోటి కార్మికులు ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి, ఆనంద్, ఏరాజులు బాధితురాలిని పరామర్శించారు. పారిశుద్ధ కార్మికుల పట్ల సర్కిల్ అధికారులు శ్రద్ధ వహించాలని కోరారు.

మున్సిపల్ కార్మికుడి బలవన్మరణం

మణికొండ: అనారోగ్య సమస్యలు, భార్యాభర్తల మధ్య వాదులాటతో మణికొండ మున్సిపాలిటీలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న యాదయ్య (48) బలవన్మరణానికి పాల్పడ్డాడు. శివాజీనగర్ కాలనీలో నివాసముంటున్న యాదయ్యకు ఇటీవలే జాండిస్ వచ్చింది. దీంతో భార్య మద్యం తాగవద్దని సూచించింది. ఇదే విషయంలో శనివారం ఉదయం భార్య గొడవపడి అంగన్‌వాడీ స్కూల్‌కు వెళ్లగా, ఇద్దరు పిల్లలు కళాశాలలకు వెళ్లారు. దీంతో మనస్తాపానికి గురైన యాదయ్య ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని తమ్ముడు చూసి వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఘటనా స్థలానికి చేరుకున్న రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

బురిడీ కొట్టించబోయి.. బుక్కయ్యారు!

- శాంతిపూజ చేస్తామంటూ బంగారం కాజేసే యత్నం
- బాధితుడి అరుపులతో అప్రమత్తమైన స్థానికులు
- పరిగి మండలం నస్కల్‌లో దొంగబాబాలకు దేహశుద్ధి
- పోలీసుల అదుపులో ముగ్గురు రాజస్థాన్ వాసులు



బొలేరో వాహనంలో దొంగ బాబాలు



పోలీసులు స్వాధీనం చేసుకున్న సామగ్రి

పరిగి: బాబాల అవతారంలో జనాలను బురిడీ కొట్టించేందుకు ప్రయత్నించిన దొంగబాబాలకు దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన పరిగి మండలం నస్కల్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ముగ్గురు వ్యక్తులు కాషాయ వస్త్రాలు ధరించి, విభూది పెట్టుకొని గ్రామంలోకి ప్రవేశించారు. పరిగి – వికారాబాద్ మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో భోజనం తిన్నారు. నిర్వాహకుడు శ్రీధర్ డబ్బులు అడగగా 'మేము స్వామీజీలం మమ్మల్ని డబ్బులు అడగొద్దు.. మీకు అంతా మంచి జరుగుతుంది' అన్నారు. అంతటితో ఆగకుండా మాటలో మాట కలిపి 'నీ జాతకం ఏమీ బాగోలేదు.. చాలా సమస్యలు ఎదుర్కొంటున్నావు.. శాంతిపూజ చేస్తే మేలు జరుగుతుంది' అని నమ్మబలికారు. శ్రీధర్ వీరి మాటలు నమ్ముతున్నట్లు గుర్తించి.. ఇంట్లోకి వెళ్లి ఒక రాగి చెంబు తీసుకురమ్మని సూచించారు. అనంతరం చెంబునిండా నీళ్లు తెమ్మన్నారు. ఆతర్వాత ఏవో మంత్రాలు చదువుతున్నట్లు చేసి, విభూది, కుంకుమ వంటివి వేశారు. అనంతరం శ్రీధర్ చేతికి ఉన్న బంగారు ఉంగరాన్ని అందులో వేయమన్నారు. ఉంగరం వేయగానే.. ఇంట్లోకి వెళ్లి తెల్లని వస్త్రం తీసుకురమ్మన్నారు. అతను వస్త్రం తీసుకుని వచ్చేలోపే.. వారి వద్ద ఉన్న తెల్లటి వస్త్రంలో ఓ గులకరాయిని పెట్టి చెంబుకు కట్టారు. దాన్ని శ్రీధర్ చేతిలో పెట్టి రేపటి వరకూ వస్త్రం విప్పకూడదని చెప్పారు. అనంతరం అక్కడి నుంచి వెళ్లిపోతుండగా.. అనుమానం వచ్చిన శ్రీధర్ వస్త్రాన్ని విప్పి చూడగా రాయి కనిపించింది. కంగుతిన్న బాధితుడు ఇదేమిటని ప్రశ్నిస్తుండగా పారిపోయే ప్రయత్నం చేశారు. అడ్డుకోవడానికి ముందుకు వెళ్లడంతో వారి చేతిలో ఉన్న కత్తిలాంటి వస్తువులను పైకి విసిరారు. ఊహించని ఈ పరిణామంతో శ్రీధర్ గట్టిగా అరిచాడు. అప్పటికే దొంగబాబాలు తాము వచ్చిన బొలేరో వద్దకు చేరుకున్నారు. బాధితుడి అరుపులు విన్న స్థానికులు వెంటనే బాబాలను అడ్డుకుని, దేహశుద్ధి చేశారు. పోలీసులు వచ్చి విచారణ చేయగా రాజస్థాన్ రాష్ట్రం, సాలి జిల్లా, చెట్టిదూదాని గ్రామానికి చెందిన రావత్‌నాథ్, మిట్టన్‌నాథ్, మేఘనాథ్‌లుగా గుర్తించారు. వీరు ప్రయాణిస్తున్న బొలేరోకు గుజరాత్ పాసింగ్ నంబర్ ప్లేట్ ఉంది. బాధితుడు శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.